సాక్షి మహబూబాబాద్

బుధవారం | 19 | జూలై | 2023



సమస్యలు పరిష్కరించాలి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతారాం అన్నారు. - 8లో▸



కొలువు..గెలువు

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు మైనార్టీస్ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29⁰ /23⁰

వాతావరణం

జిల్లాలో ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తాయి. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



డోర్నకల్: మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలోని కొత్తూరువీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాల సమీపంలో స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే గుంతల్లో స్తంభాలను నిలబెట్టి మట్టి పూడ్చలేదు.. ఈక్రమంలో కురిసిన వర్షానికి గుంతల్లోకి నీరు చేరడంతో ఓ స్తంభం రోడ్డు వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది.

డీసీఎస్ఓగా బి.రాజేందర్

మహబూబాబాద్: సివిల్ సప్లయీస్ శాఖలో డీసీఎస్ఓలు, ఏసీఎస్ఓలను బదిలీ చేస్తూ కమిషనర్ అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ డీసీఎస్ఓగా బి.రాజేందర్‌ను నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జ్ డీసీఎస్ఓ నర్సింగరావు జయశంకర్‌భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా వనపర్తి జిల్లా సీనియర్ ఏసీఎస్ఓగా పని చేస్తున్న రాజేందర్ జిల్లాకు బదిలీపై రానున్నారు.

పెరుగుతున్న పసుపు ధర..



కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం క్వింటా పసుపునకు (గోళారకం) గరిష్ట ధర రూ.9.511పలికింది. ఈ సీజన్ ప్రారంభంలో క్వింటాకు గరిష్ట ధర రూ.5 వేల నుంచి 6 వేల వరకు పలికింది. కాగా వారం రోజులుగా మార్కెట్‌లో ధర పెరుగుతూ వస్తోంది. మంగళవారం మార్కెట్‌కు 116 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకానికి గరిష్ట ధర రూ.9,321, కనిష్ట ధర రూ.6,600 పలుకగా, గోళారకానికి గరిష్ట ధర రూ.9,511, కనిష్ట ధర రూ.7,015 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నేడు మార్కెట్‌కు సెలవు

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ భీమా మృతికి సంతాపకంగా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

నీలికుర్తి సర్పంచ్ ఔదార్యం..



మరిపెడ రూరల్: మరిపెడ మండలం నీలికుర్తి గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు ఔదార్యం చాటుకున్నాడు. సొంత ఖర్చులతో గ్రామానికి బైపాస్ రోడ్డు వేయించాడు. గ్రామ ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు విస్తరణకు స్థానికులు ఒప్పుకోలేదు. కాగా సర్పంచ్ శ్రీనివాసరావు గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని ఆలోచన చేశాడు. సొంత నిధులు రూ.3లక్షలు వెచ్చించి గ్రామ శివారు వీరసముద్రం చెరువు శిఖం మీదుగా 300 మీటర్ల మట్టి రోడ్డు నిర్మాణం చేయించాడు. దీంతో బావోజిగూడెం, వెంకంపాడు పలు గిరిజన తండాల వాహనదారులు ఈ రహదారి మీదుగా ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ శ్రీనివాసరావును అభినందిస్తున్నారు.

హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ బీఓఎస్‌గా కనకరత్నం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కనకరత్నం నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కనకరత్నం డిప్యుటేషన్‌పై కేయూ హిస్టరీ విభాగంలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు బీఓఎస్‌గా బాధ్యతలను నిర్వర్తించిన టి.మనోహర్ నుంచి ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

కిస్తీల డబ్బులు స్వాహా..

- రుణాల పైసలు కాజేసిన సీఏ, ఆర్పీలు
- మూడు ఆర్పీల పరిధిలో అవకతవకలు
- రోడ్డెక్కి ఆందోళన చేసిన మహిళా సంఘాల సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి ప్రభుత్వం రుణాలు ఇప్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా(మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ) సంఘాల నిర్వహణ బాధ్యతల చూస్తున్నాయి. కాగా సభ్యులు తమ పిల్లల చదువుల కోసం, చిన్న చిన్న పరిశ్రమలు, చిరు వ్యాపారాలు, పాడి గేదెలు, పశుపోషణ కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. సభ్యులు నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా గ్రూపుల నిర్వహణ చూసే సీఏ, ఆర్పీలకు డబ్బులు ఇస్తున్నారు. అయితే ఇదే అదునుగా భావించిన సదరు ఉద్యోగులు ఒక్క కిస్తీ డబ్బులు కూడా బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. ఈ క్రమంలో కొత్త రుణం కావాలని కొందరు సభ్యులు బ్యాంకుకు వెళ్లగా.. పాత అప్పు తీరలేదని, మళ్లీ రుణం ఎలా ఇస్తామని తెలపడంతో మోసపోయామని తెలిసి లబోదిబోమంటూ ఆర్పీ, సీఏలను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి, సమీపంలోని దర్గాతండా, టేకులతండా, రేగడి గూడంలో జరిగింది. కాగా తమకు న్యాయం చేయాలని మహిళా సంఘాల సభ్యులు మంగళవారం రోడ్డెక్కి ఆందోళన చేశారు.

బయట పడింది ఇలా..

దర్గాతండాకు చెందిన తిరుపతి వేంకటేశ్వర మహిళా పొదుపు సంఘం మహబూబాబాద్ మెప్మా పరిధిలో ఉంది. ఈ సంఘంలో పదిమంది సభ్యులు ఉన్నారు. 2021 నవంబర్‌లో రూ.3,75,000 బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నారు. ఒక్కొక్కరు రూ.3,7500 తీసుకొని నెలనెలా కిస్తీలు చెల్లిస్తున్నారు. ఆర్పీ, సీఏలకు డబ్బులు ఇచ్చి బ్యాంకులో జమ చేయమని చెబుతున్నారు. గ్రూపు బ్యాంకు పాస్‌పుస్తకాలు, తీర్మానం పుస్తకాలు కూడా వారి వద్దనే ఉంచారు. ఈ క్రమంలో తీసుకున్న అప్పు



రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న మహిళలు



మహిళలతో మాట్లాడుతున్న మెప్మా డీఎంసీ విజయ, ఆర్పీలు, సీఏలు

కిస్తీలు పూర్తిగా చెల్లించామని, కొత్త రుణం తీసుకుందామని కొంతమంది సభ్యులు బ్యాంకుకు వెళ్లగా అసలు విషయం బయటపడింది. 'మీ సంఘం అప్పు చెల్లించలేదు. అసలు, వడ్డీ కలిసి రూ.7,66,484 చెల్లించాల్సి ఉంది. మీకు కొత్త అప్పు ఇవ్వలేమని' బ్యాంకర్లు చెప్పడంతో సభ్యులు లబోదిబోమంటూ సీఏ, ఆర్పీలను నిలదీశారు. దీంతో స్వాహా విషయం వెలుగులోకి వచ్చింది.

మిగిలిన సంఘాల్లో ఆందోళన..

దర్గాతండా మహిళలు చెల్లించిన డబ్బులు బ్యాంకులో జమ కాలేదని తెలియడంతో ఈదులపూసపల్లి, దర్గాతండా, రేగడిగూడెం, టేకులతండాల్లోని మూడు ఆర్పీల పరిధిలో ఉన్న 68 గ్రూపుల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.2కోట్లకు పైగా డబ్బులు కాజేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు మహిళా సంఘాల సభ్యులు ఈదులపూసపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. అవకతవకలపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న మానుకోట రూరల్ ఎస్సై రామచరణ్ సంఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

మెప్మా అధికారులు ఏం చేస్తున్నారు?

మహిళా సంఘాల ఆదాయ, వ్యయాలు, అప్పులు, పొదుపుపై లెక్కలు తేల్చి.. వారు చెల్లించిన కిస్తీలను సక్రమంగా బ్యాంకులో జమ చేసేందుకు దోహదపడాల్సిన మెప్మా అధికారులు అవకతవకలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మహిళలు అవేదన వ్యక్తం చేశారు. రుణాలు కావాలని వెళ్తే రూ.లక్షకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూళ్లు చేస్తారని, ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు మాత్రం నోరుమెదపడం లేదని మండిపడ్డారు. ఈదులపూసపల్లి, శివారు ప్రాంతాల్లో రెండేళ్ల నుంచి సంఘాల జమ, ఖర్చులపై ఆడిట్ చేయలేదని తెలిపారు. కాగా ఈ వ్యవహారం చూస్తుంటే కిస్తీల డబ్బుల స్వాహాలో మెప్మా అధికారులతో పాటు పలువురు బ్యాంకర్ల ప్రమేయం కూడా ఉందని, ఉన్నతాధికారులు విచారణ జరిపించి డబ్బులు ఇప్పించడంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

రూ.120 కోట్లతో తొర్రూరు అభివృద్ధి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నామని, దీనికి రూ.120 కోట్లు వెచ్చిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.27 కోట్లు వెచ్చించి 24 గంటల పాటు మంచినీరు అందిస్తామన్నారు. రూ.14 కోట్లతో వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రూ.2 కోట్లతో ధోబీ ఘాట్లు నిర్మిస్తున్నారు. తొర్రూరు పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ.5 కోట్లతో అంబేడ్కర్ భవన్, బుడిగ జంగాల భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్ర అభివృద్ధిని చూసి కేంద్ర ప్రభుత్వం కూడా అవార్డులు ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొందన్నారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యువతకు డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రముఖ గాయకుడు గిద్దె రాంనర్సయ్యను మంత్రి పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటనారాయణ గౌడ్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కేసీఆర్ పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి

కురవి: సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాయని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా నుంచి మున్నేరువాగు వరకు, వాగు అవతలి నుంచి బయ్యారం మండలం నర్సతండా జీపీ పరిధిలోని మాన్యతండా వరకు రూ.1.35కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. పెద్దతండా, మాన్యతండా ప్రజల చిరకాల వాంఛ అయిన బీటీ రోడ్డు నిర్మాణం నెరవేరుతుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కోట్ల నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, జెడ్పీటీసీ వెంకటరెడ్డి, సర్పంచ్ వనజాశ్రీరాం నాయక్, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, శ్రీను, జీవన్, శ్రీధర్‌రెడ్డి, మన్యూ పాల్గొన్నారు.

పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన బీసీ కులవృత్తులు, చేతి వృత్తుల వారికి రూ.లక్ష సాయం అందేలా చూడాలన్నారు. జిల్లాలో 9,978 దరఖాస్తులు రాగా మొదటి విడతలో సుమారు 2,678మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకం విషయంలో సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలన్నారు.



శంకుస్థాపనలో మంత్రి సత్యవతిరాథోడ్

కనీస వేతనం అమలు చేయాలి

- మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల నిరసన

తొర్రూరు: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. గ్రామ పంచాయతీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రవి మాట్లాడుతూ.. గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పొద్యా బీకు, మండల అధ్యక్షుడు గుండాల సోమ నర్సయ్య, నాయకులు తంగళ్లపల్లి యాకయ్య, కాగు రాజు, గూడెల్లి మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఓటు హక్కు నమోదుపై ప్రచారం చేయాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: గ్రామాలు, పట్టణాల్లో ఓటు హక్కు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఓటు హక్కు నమోదు ప్రక్రియపై బూత్ లెవల్ అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు నమోదుకు బీఎల్ఓ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫారాలు నింపే క్రమంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. దివ్యాంగ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతు వేదికల్లో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శిక్షణలో వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ డేవిడ్, ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరిశీలన వేగవంతం చేయాలి..

జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జీఓ 58, 59 దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు జీఓల ద్వారా జిల్లాలో మొత్తం 6,974 దరఖాస్తులు వచ్చాయన్నారు. పరిశీలనతో పాటు డాటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.




అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శశాంక

పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్వచ్ఛ సర్వేక్షన్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో సేవ చేయడం అభినందనీయం

కొత్తగూడ: పట్టణాలకే పరిమితమై నిత్యం బిజీగా ఉండే వైద్యులు ఏజెన్సీ గ్రామాలకు వచ్చి సేవ చేయడం అభినందనీయమని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్ అన్నారు. రోటరీ క్లబ్ బంజారాహిల్స్, ఎంఎన్‌జే కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని పీఓ ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ నుంచి మారుమూల ఏజెన్సీ గ్రామాలకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేస్తున్నారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, మహిళల్లో గర్భాశయ కేన్సర్ ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రారంభ దశలో తెలుసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చన్నారు. అందరూ ఓపికగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తమకు అవకాశం కల్పించిన కలెక్టర్ శశాంకకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్, ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, ఎంపీడీఓ భారతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్లు మురళీనాయక్, శివప్రసాద్, ప్రత్యూష, ఎంఎన్‌జే ఆస్పత్రి రేడియాలజిస్టులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



కేన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రారంభిస్తున్న పీఓ అంకిత్

నులిపురుగులను నలిపేద్దాం

- రేపు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ
- ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- 1.76లక్షల మందికి పంపిణీ లక్ష్యం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నెహ్రూసెంటర్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికార యంత్రాంగం సిద్ధమైంది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20న జిల్లావ్యాప్తంగా మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయసుగల పిల్లలకు మాత్రలు ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లాలో 1.76లక్షల మాత్రలు అందుబాటులో ఉంచారు. అలాగే ఈ నెల 20న మాత్రలు వేసుకోని పిల్లలకు 27వ తేదీన వేయనున్నారు.

వినియోగం ఇలా..

పిల్లలకు ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారు. తద్వారా పిల్లల్లో నులి పురుగులను నివారించవచ్చు. ఏడాది నుంచి రెండేళ్ల వయసుగల పిల్లలకు 200 ఎంజీ మాత్ర నీటిలో కలిపి తాగించాలి. మూడేళ్ల నుంచి 19ఏళ్ల వయసు గల పిల్లలకు 400 ఎంజీ మాత్ర వేస్తారు.

జాగ్రత్తలు ఇలా..

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న కొందరు పిల్లల్లో వాంతులు, వికారం కలిగితే వెంటనే వైద్యులకు సమాచారం అందించాలి. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు మాత్రలు వేయవద్దు. బలవంతంగా పిల్లలకు వేయకూడదు.



వయసుల వారీగా మాత్రలు తీసుకునే పిల్లలు	
1 నుంచి 5ఏళ్ల వరకు పిల్లలు	36,068
6 నుంచి 10 ఏళ్ల వరకు పిల్లలు	51,998
11 నుంచి 19 ఏళ్ల కలిగిన పిల్లలు	88,040

లక్షణాలు..

- నులి పురుగులు ఉన్న పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుంది
- నులిపురుగులు ఏర్పడితే నీరసంగా ఉంటారు
- చదువుపై ఏకాగ్రత కోల్పోతారు
- రాత్రి పూట సరిగా నిద్రపోరు
- పిల్లల్లో కడుపునొప్పికి నులిపురుగులు దారి తీస్తాయి
- మలబద్ధకం ఏర్పడుతుంది

పిల్లలందరికీ పంపిణీ చేస్తాం

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు మాత్రలను వేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుంది.

-బి.హరీశ్‌రాజ్, డీఎంహెచ్ఓ

సమస్యల పరిష్కారానికి సమ్మె ఏకైక మార్గం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమ్మె ఏకైక మార్గమని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి, కవిత అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత డీఈఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని, ఉద్యోగులకు మరణ శాసనంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి, జూలై 2023 నుంచి ఐఆర్ ప్రకటించాలన్నారు. కేజీబీవీ, గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ఐటీ మినహాయింపు పరిధి పెంచాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభాకర్, సంజీవ, ఉపేందర్, సదానందం, రమేష్, భద్రునాయక్, శ్రీనివాస్, విద్యాసాగర్, హరి, ప్రవీణ్, ప్రసాద్, శ్రీనివాస్, రవి, నాగముని, కుమార్, లక్ష్మయ్య , శ్రీనివాస్, రాజు, మోహన్, సురేష్, వీరన్న పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మరోసారి ఆదరించాలి

- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి: అద్భుత పాలన చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగు, పోలంపల్లితండా, హరిదాసుతండాల్లో ఆయన పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా గ్రామాల్లో అసైన్డ్ భూములు పట్టాలు ఇవ్వాలని, పట్టాలు ఇస్తే అన్ని ఓట్లు మీకే వేస్తామని ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు పట్టాల విషయమై కలెక్టర్ దగ్గరకు వెళ్తున్నామని తెలిపారు. స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామానికి పల్లె దవాఖాన ఇస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు..

మండలంలోని హరిదాసుతండా జీపీలో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసు వాహనానికి అడ్డు తగిలారు. రెడ్యానాయక్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను పక్కకు నెట్టేసే యత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కాగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేను తలచుకుంటే మీ కాంగ్రెస్ నాయకులు ఎన్ని ఊర్లు తిరుగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లాల్, నరేష్, సరిత, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, చైర్మన్లు గార్లపాటి వెంకటరెడ్డి, తోట లాలయ్య, అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీపక్, మాలోత్ సూర్యనాయక్, బి.సోమయ్య, బానోత్ గణేష్, గుడిబోయిన రాంచంద్రయ్య, బానోత్ రమేష్, పేర్ల గణేష్, రాజునాయక్, విజయ్ పాల్గొన్నారు.



ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

శిల్పకళా సంపద అద్భుతం

ఖిలా వరంగల్ : కాకతీయులు నిర్మాణాలు, శిల్పకళా సంపద మహాద్భుతమని హనుమకొండ, నిజామాబాద్, వికారాబాద్, ఆదిలాబాద్, జయశంకర్, ఖమ్మం జిల్లాల ట్రెయినీ కలెక్టర్లు శారదాశుక్లా, కోహిసెట్టి కిరణ్మయి, మాలెంపటి నారాయణ, మహతో వికాస్, ఉమాశంకర్‌ప్రసాద్, మయాంక్‌సింగ్ అన్నారు. ఖిలావరంగల్ కోటను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భగా కాకతీయుల కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుత శిల్ప సంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను పర్యాటక శాఖ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, కోట గైడ్ రవియాదవ్ ట్రెయినీ కలెక్టర్లకు వివరించారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది, హనుమకొండ డిప్యూటీ తహసీల్దార్ శర్మ, టూరిజం శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, టీఎస్‌టీడీసీ సౌండ్ అండ్ లైటింగ్ షో ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ ఉన్నారు.

లైంగికదాడి, హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కేసముద్రం: ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్యచేసిన ఓ వ్యక్తికి మహబూబాబాద్‌ కోర్టు మంగళవారం జీవితఖైదు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసముద్రం మండలంలో కాట్రపల్లి గ్రామానికి చెందిన మహిళ మాధవపెద్ది విజయ కేసముద్రంస్టేషన్‌లోని ఉప్పరపల్లి రోడ్డువైపు ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. కాగా, 2011 ఆగస్టు 9న రాత్రి కరీంనగర్‌ జిల్లా కాటారం మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చల్లా మహేశ్‌.. విజయపై లైంగికదాడికి దాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారంతో వెళ్లిపోయాడు. దీనిపై నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన మృతురాలి సోదరుడు కొంకాల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎస్సై డేవిడ్‌రాజ్‌, రూరల్‌ సీఐ అంజయ్య.. నిందితుడిని రిమాండ్‌ చేశారు. అనంతరం చార్జ్‌షీట్‌ ఫైల్‌చేయగా కోర్టు డ్యూటీ ఆఫీసర్‌ అశోక్‌రెడ్డి, సిబ్బంది రవీందర్‌, దేవా.. 23 మంది సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు బాధితుల తరఫున వాదించారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్‌ డిస్ట్రిక్ట్‌ సెషన్స్‌ జడ్జి మహబూబాబాద్‌ చంద్రశేఖర్‌ప్రసాద్‌.. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టిన డీఎస్పీ సత్యనారాయణ, రూరల్‌ సీఐ రమేశ్‌, ఎస్సై తిరుపతిని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ అభినందించారు.

భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు..


సంపత్‌

టేకుమట్ల(రేగొండ): జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గాంధీనగర్‌ గ్రామంలో 2019లో నమోదైన హత్య కేసులో పల్లబోయిన సంపత్‌ అనే నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. పదివేల జరిమానా విధిస్తూ జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణ బాబు మంగళవారం తీర్పునిచ్చారు. పల్లెబోయిన సంపత్‌, సుమలత దంపతులు గాంధీనగర్‌లో నివాసం ఉండేవారు. మద్యానికి బానిసైన సంపత్‌.. 2019 సంవత్సరంలో సుమలతతో గొడవ పడి కత్తితో పొడువగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి సీఐ సాయి రమణ కేసు నమోదు చేసి చార్జిషీట్‌ ఫైల్‌ చేయగా, ప్రస్తుత చిట్యాల సీఐ వేణు చందర్‌, రేగొండ ఎస్సై శ్రీకాంత్‌ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్‌ జ్యోతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ ఘటనలో నేరం రుజువు కావడంతో సంపత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పును తీర్పునిచ్చారు. కాగా, ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ తరఫున వాదనలు వినిపించిన పి.పి జి. శివరాజు, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టిన రేగొండ ఎస్సై శ్రీకాంత్‌ రెడ్డి, చిట్యాల సీఐ వేణుచందర్‌, కోర్టు కానిస్టేబుల్‌ జ్యోతిని జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జె సురేందర్‌ రెడ్డి అభినందించారు.


కోచింగ్‌ సెంటర్‌లో క్లాస్‌ వింటున్న అభ్యర్థులు(ఫైల్‌)

కొలువు..గెలువు

- మైనార్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో కోచింగ్‌
- దరఖాస్తుకు ఈనెల 23 వరకు గడువు
- వచ్చేనెల 6న స్క్రీనింగ్‌ టెస్ట్‌

న్యూశాయంపేట : సివిల్‌ సర్వీసెస్‌–2024 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్‌ స్టడీ సర్కిల్‌, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. ఈ సంవత్సరంలో వందమంది అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్‌ సెంటర్లలో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ, సీఎస్‌ఏటీ నిర్వహించే ప్రిలిమ్స్‌, మెయిన్స్‌ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్‌, సిక్కులు, జైన్‌, బుద్దిస్‌, పార్శీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్క్రీనింగ్‌ టెస్ట్‌లో సాధించిన మెరిట్‌ ఆధారితంగా కోచింగ్‌ సెంటర్‌లో అడ్మిషన్‌ ఇస్తారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీ గురుకులాల్లో స్క్రీనింగ్‌ టెస్ట్‌ నిర్వహిస్తారు.

అర్హత..

సివిల్స్‌ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని జనరల్‌, ప్రొఫెషనల్‌ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించొద్దు. ఈ శిక్షణలో మహిళా అభ్యర్థులకు 33, దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్‌ ద్వారా సీట్లు కేటాయించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్‌ ప్రాతిపదికన ఉంటుంది.

దరఖాస్తుకు గడువు

సివిల్‌ సర్వీసెస్‌ స్క్రీనింగ్‌ టెస్ట్‌ కోసం డిగ్రీ పూర్తిచేసి సివిల్స్‌ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఈటీ.జీఓవీ.ఇన్‌/టెమ్రిస్‌ నందు దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుకు గడువు ఈ నెల 23వ తేదీ.

స్క్రీనింగ్‌ టెస్ట్‌

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల(ఆగస్టు 6న) స్క్రీనింగ్‌ టెస్ట్‌ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరంగల్‌, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్‌, ములుగు, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాల కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మైనార్టీలు సివిల్స్‌లో సత్తా చాటేందుకు శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర వివరాలకు 040–23236112 నంబర్‌లో గాని, ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలి.

కే.విక్రమ్‌కుమార్‌, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, వరంగల్‌

‘క్రీస్తుజ్యోతి’కి ప్రపంచ స్థాయి గుర్తింపు

- మందిరం వ్యవస్థాపకులు పాల్సన్‌ రాజ్‌, జయప్రకాశ్‌


మాట్లాడుతున్న పాల్సన్‌ రాజ్‌

ధర్మసాగర్‌: హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌ మండలం కరుణాపురం గ్రామంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడం ఎంతో అదృష్టమని మందిరం వ్యవస్థాపకులు దైవజనులు రెవరెండ్‌ డాక్టర్‌ సంగాల పాల్సన్‌ రాజ్‌, రెవరెండ్‌ డాక్టర్‌ గోపు జయప్రకాశ్‌ అన్నారు. ఈమేరకు మంగళవారం వారు ప్రార్థనా మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ఆసియా ఖండంలో అతిపెద్దగా సుమారు 40 వేల మంది క్రైస్తవ విశ్వాసులు ఒకే సారి దేవుడి ప్రార్థనలో గడిపేలా అన్ని హంగులతో క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని నిర్మించామన్నారు. దీనిని మే 4వ తేదీన ప్రారంభించామన్నారు. చర్చి ప్రత్యేకత, తమ సేవ పరిచర్యను తెలుసుకుని రెండు అంతర్జాతీయ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు జూన్‌ 16న యూఎస్‌ కాంగ్రెస్‌ మెన్‌ డానికె డేవిడ్‌ పీస్‌ ప్రైజ్‌ 2023, యూఎస్‌ హౌజ్‌ ఆఫ్‌ రిప్రజెంటివ్‌ కాంగ్రెసనల్‌ రివార్డు మెడల్‌, ప్రశంస పత్రం యూఎస్‌ ఎంపీ జోనతన్‌ జాక్సన్‌ చేతుల మీదుగా అందజేశారని తెలిపారు. ఈ రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందని, అవార్డులు ప్రదానం చేసిన అమెరికా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘మోడల్‌’ టీచర్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్‌..


విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

జనగామ రూరల్‌: మండలంలోని చౌడారం మోడల్‌ పాఠశాల ఉపాధ్యాయులు.. తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విద్యార్థుల లేఖపై ‘సాక్షి’లో ప్రచురితమైన ‘రూపాయి బిల్లా, బాయిలా బంగారం ’అనే కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన కథనంపై విద్యాశాఖ మంత్రి దృష్టికి రాగా కలెక్టర్‌ వెంటనే స్పందించి డీఈఓను విచారణకు ఆదేశించారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు డీఈఓ కమిటీని నియమించారు. మంగళవారం నోడల్‌ అధికారి ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల వాయిస్‌లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను బుధవారం ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత ఉపాధ్యాయులను తొలగించాలి

మోడల్‌ పాఠశాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన ఉపాధ్యాయులతో పాటు పూర్తి బాధ్యతగా ప్రిన్సిపాల్‌ను కూడా తొలగించాలి. ఏ పాఠశాలలో కూడా ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–చిలువేరు అభిగౌడ్‌, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

హన్మకొండ: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర డిప్యూటీ జనరల్‌ సెక్రటరీ తూపురాణి సీతారాం అన్నారు. మంగళవారం హనుమకొండలో అసోసియేషన్‌ నాయకుడు ఇ.నరేందర్‌ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటిని పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు వివరించారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు చెల్లించడం లేదని, కార్పొరేట్‌ హాస్పిటళ్లలో హెల్త్‌ కార్డులపై వైద్యం అందించడం లేదన్నారు. జూలై 1 నుంచి వర్తించే కొత్త పే రివిజన్‌ కమీషన్‌ ఇంతవరకు వేయలేదని, బకాయి కరువు భత్య వాయిదాలను ప్రకటించలేదని మండిపడ్డారు. ఈ సమస్యలన్ని పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో నాయకులు నారాయణగిరి వీరన్న, భేతి శంకర్‌ లింగం, ఆర్తి సంపత్‌ కుమార్‌, కరేటి శంకర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్‌


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో రోజు నిరంతరంగా ఉచిత విద్యుత్‌ ఇస్తుండగా.. పీసీసీ చీఫ్‌ రేవంత్‌ రెడ్డి మాత్రం మూడు గంటలే ఇస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పాలకుర్తిలో రైతులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్‌ పాలనలో రైతులను పట్టించుకోలేదన్నారు. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌ కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌ కుమార్‌, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీకోఆప్షన్‌ సభ్యుడు ఎం.డి మదార్‌, పాలకుర్తి సర్పంచ్‌ వీరమనేని యాకాంతారావు, ఏఎంసీ చైర్మన్‌ ముస్కు రాంబాబు, సహకార సంఘం చైర్మన్‌ బొబ్బాల అశోక్‌ రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, భూమ రంగయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల రాస్తారోకో


ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాల వద్ద రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు

- రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌

కేయూ క్యాంపస్‌: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ స్టేట్‌ యూనివర్సిటీస్‌ కాంట్రాక్ట్‌ టీచర్స్‌ జాక్‌ (కేయూ)ఆధ్వర్యంలో మంగళవారం వర్షంలోనే హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కళాశాల ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జాక్‌ కన్వీనర్‌ డాక్టర్‌ చిర్రరాజు, వైస్‌ చైర్మన్‌ డాక్టర్‌ బి వెంకటగోపీనాథ్‌ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజ్‌ చేయాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. సీఎం కేసీఆర్‌ గతేడాది జూలై 18న హనుమకొండకు వచ్చిన సందర్భంలో తమను రెగ్యులరైజ్‌ చేయాలని కోరగా చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఇటీవల కూడా మంత్రులు ,ఇతర ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఇటీవలనే ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్‌, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్‌ కళాశాలల లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేశారన్నారు. అలాగే, యూనివర్సిటీల కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను కూడా రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కాగా, రాస్తారోకోతో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో రాష్ట్ర జాక్‌ కోకన్వీనర్‌ డాక్టర్‌ మంతెన శంకరయ్య, బాధ్యులు డాక్టర్‌ టి రాధిక, డాక్టర్‌ టి నాగయ్య, డాక్టర్‌ భిక్షపతి, డాక్టర్‌ రమేశ్‌, శ్రీదేవి, సునీత, కనకయ్య, స్వామి, ప్రసాద్‌, కర్రె సదాశివ, మామిడి లింగయ్య, పుల్లా రమేశ్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

పుప్పాలగుట్టలో సైకో వీరంగం

- ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తిపై దాడి
- ఆస్పత్రికి తరలింపు


స్థానికులు విద్యుత్‌ స్తంభానికి కట్టేసిన సైకో ఇతనే..

ఖిలా వరంగల్‌: వరంగల్‌ పుప్పాల గుట్టలో ఓ సైకో వీరంగా సృష్టించాడు. ఓ ఇంట్లోకి చొరబడి అ కారణంగా యువకుడిపై రోకలి బండతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన కొండేటి అంజమ్మ, సాయిలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు శ్రీనివాస్‌(33) ఉన్నారు. కాగా, ఏపీలోని కాకినాడ రామచంద్రపురం గ్రామానికి చెందిన నీలం సత్యనారాయణకు మనసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో వరంగల్‌ చింతల్‌ బ్రిడ్జి సమీపాన రైలు దిగి కాలనీలోకి ప్రవేశించాడు. అనంతరం అనుకోకుండా శ్రీనివాస్‌ ఇంటి తలుపులను బలంగా కొట్టడంతో ఊడి కిందపడ్డాయి. వెంటనే పక్కన ఉన్న రోకలి బండతో ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాస్‌పై దాడి చేయగా ఆయనకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అడ్డుకోపోయిన మరో ఇద్దరిపై సైకో దాడికి పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు కేకలు వేయగా కాలనీ వాసులు చేరుకుని సైకోను పట్టుకుని దేహశుద్ధి చేసి మిల్స్‌ కాలనీ పోలీసులకు అప్పగించారు. పలుమార్లు విచారించిన సమాధానం చెప్పలేని చెప్పలేదు. కనీసం పేరు కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాడు. అతడి మానసిక స్థితి సరిగా లేదని సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు కాగా, సైకో దాడిలో గాయపడిన కొండేటి శ్రీనివాస్‌ను స్థానిక సామాజిక వేత్త ఎల్‌.శ్రీనివాస్‌ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

గంజాయి పట్టివేత కేసులో..

- ఒకరికి పదేళ్ల జైలు
- రూ. లక్ష జరిమానా

మహబూబాబాద్‌ రూరల్‌: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్‌ మంగళవారం తీర్పు ఇచ్చారు. మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ వై.సతీశ్‌ కథనం ప్రకారం గతేడాది ఆగస్టు 8వ తేదీన అప్పటి టౌన్‌ ఎస్సై కె.క్రాంతికిరణ్‌ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్‌ చేస్తున్నారు. శ్రీనివాస సెంటర్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో కనిపించగా అతడిని విచారించారు. రెండు బ్యాగుల్లో పరిశీలించగా 5 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలోని గంజాం జిల్లా నెయాలీశ్రీనిబాసపూర్‌ గ్రామానికి చెందిన తపన్‌ గౌడ్‌ ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న గంజాయిని టౌన్‌ సీఐ వై.సతీశ్‌కు అప్పగించి అప్పటి టౌన్‌ ఎస్సై కె.క్రాంతికిరణ్‌ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణ ద్వారా గతేడాది నవంబర్‌ 19న మహబూబాబాద్‌ జిల్లా కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు హెడ్‌ కానిస్టేబుల్‌ బీరం సంపత్‌రెడ్డి, కానిస్టేబుల్‌ బానోత్‌ మోహన్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్‌ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న మానుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్‌ నేరం నిరూపణ కావడంతో తపన్‌ గౌడ్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శరత్‌ చంద్ర పవార్‌, డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు.

ఆన్‌లైన్‌ మోసం ..

- రూ.3.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

మహబూబాబాద్‌ రూరల్‌ : టెలిగ్రామ్‌ యాప్‌ పేరుతో వచ్చిన కాల్‌ను ఓ వ్యక్తి నమ్మాడు. అనంతరం తన ఫోన్‌కు వచ్చిన లింక్‌లో రూ.3.80 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని ఎన్జీఓస్‌ కాలనీకి చెందిన పెరుమాండ్ల శ్రవణ్‌కుమార్‌ సెల్‌ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం ఒక మెసేజ్‌ వచ్చింది. అధిక మొత్తంలో పెట్టుబడి పెడితే, అధిక లాభం వస్తుందని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో శ్రవణ్‌ కుమార్‌ సదురు యాప్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రూ.3.80 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఈ క్రమంలో మంగళవారం లింక్‌ ఓపెన్‌ చూడగా తన డబ్బు వివరాలు కనిపించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన శ్రవణ్‌కుమార్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ వై.సతీశ్‌ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఏడుగురి అదృశ్యం..

ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏడుగురు అదృశ్యమయ్యారు. వరంగల్‌ కాశిబుగ్గలో స్నేహితుడి వద్దకు వెళ్లిన ఓ విద్యార్థి.. భర్త వేధింపులు భరించేలేక హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి.. మహబూబాబాద్‌ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో ఓ యువతి.. మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన ఆటో డ్రైవర్‌ .. మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యారు. వీరి ఆచూకీ కోసం ఆయా కుటుంబాలు బంధువులు, తెలిసిన చోట్లలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

హసన్‌పర్తి : భర్త వేధింపులు భరించలేక భార్య తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన బోనగిరి యాదగిరి చిన్నకూతురు మమతతో ఆరేళ్ల క్రితం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఆళ్ల ప్రభుకు వివాహం జరిగింది. ఇతర లాంఛనాలతోపాటు వ్యవసాయ భూమిని కట్నం కింద ఇచ్చారు. వీరికి కుమారుడు అక్షర్‌(5),కూతురు చిచ్చు(3)ఉంది. భూమి విషయమై దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమికి సంబంధించిన వాటా డబ్బు కూడా ప్రభుకు అందించారు. అయినా ప్రభు మారకపోవడంతో మమత తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై తండ్రి యాదగిరి.. భర్త వేధింపులు భరించలేక తన కూతురు మమత ఇంటి నుంచి వెళ్లిందని సోమవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్సై సురేశ్‌ తెలిపారు.

కాశిబుగ్గలో విద్యార్థి..

రామన్నపేట : కాశిబుగ్గకు చెందిన పరికిపండ్ల శ్రీధర్‌ కుమారుడు సిద్దార్థ అదృశ్యమయ్యారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటలకు తన స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఆ యువకుడు.. ఇంత వరకూ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి శ్రీధర్‌ ఇంతేజార్‌గంజ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దార్థ.. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో బూడిదరంగు టీషర్టు, బ్లాక్‌ కలర్‌ నైట్‌ ప్యాంట్‌ ధరించాడు. సిద్దార్థ ఆచూకీ తెలిసిన వారు ఇంతేజార్‌గంజ్‌ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్‌ మల్లేశ్‌ పేర్కొన్నారు


సిద్దార్థ

బ్రాహ్మణ బజార్‌లో యువకుడు..

మహబూబాబాద్‌ రూరల్‌ : మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన సయ్యద్‌ సోహెల్‌ అదృశ్యమయ్యాడు. సోహెల్‌ హైదరాబాద్‌లో టాక్సీ ఆటో నడుపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బక్రీద్‌ సందర్భంగా ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్‌ వెళ్లాడు. అయితే సోహెల్‌ ఫోన్‌ చాలా రోజుల నుంచి కలవకపోవడంతో తండ్రి ఫైజోద్దీన్‌.. ఈ నెల 17వ తేదీన టాక్సీ యజమానికి ఫోన్‌ చేసి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సోహెల్‌ డ్యూటీకి రావడంలేదని యజమాని వివరణ ఇచ్చాడు. దీంతో ఫైజోద్దీన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టౌన్‌ ఎస్సై ఎస్‌.రవి మంగళవారం తెలిపారు.

పెద్ద ముప్పారంలో యువతి..

దంతాలపల్లి: మహబూబాబాద్‌ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో ఓ యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన హెచ్‌ ఐలయ్య, తన భార్య.. పని నిమిత్తం నెల 11వ తేదీన రాత్రి బయటకు వెళ్లి 12న ఉదయం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి వద్ద తమ కూతురు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్‌ తెలిపారు.

జమాండ్లపల్లిలో వ్యక్తి..

మహబూబాబాద్‌ రూరల్‌ : మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన దొండేటి రమేశ్‌ అదృశ్యమయ్యాడు. రమేశ్‌.. నెల క్రితం భార్య సుజాతతో గొడవపడ్డాడు. దీంతో ఆమె జమాండ్లపల్లి నుంచి వెళ్లిపోయి ఖమ్మంలోని తన పెద్ద కుమారుడు నరేశ్‌ ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచి రమేశ్‌ జమాండ్లపల్లిలోని తన ఇంటి వద్ద కనిపించడం లేదు. దీనిపై రమేశ్‌ కుమారుడు నరేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్‌ ఎస్సై రాంచరణ్‌ మంగళవారం తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

టేకుమట్ల(రేగొండ): పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాలలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్యాల స్వరూప(45) తన ఇంటి వద్ద గల మొక్కజొన్న కుప్పపై పరదా తొలగిస్తోంది. ఈ క్రమంలో పరదా లోపల ఉన్న పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త రమేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


స్వరూప(ఫైల్‌)

మాట మార్చిన ప్రేమికుడు..

- రెండేళ్ల తర్వాతే పెళ్లని బుకాయింపు..
- ప్రియురాలు, బంధువుల నిరసన

గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలంలో ప్రేమ వ్యవహారం బెడిసికొట్టింది. స్థానికులు, ఇరు వర్గాల బంధువుల కథనం ప్రకారం గీసుకొండకు చెందిన ఇంటర్‌ పూర్తి చేసిన యువతి, అదే మండలం బాలయ్యపల్లికి చెందిన డిగ్రీ చదివిన యువకుడు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం పెద్దలకు తెలియడంతో వారి ప్రేమ వ్యవహారం వివాదంగా మారింది. సదరు యువకుడితో పాటు అతడి బంధువులు ఆ యువతితో పెళ్లికి ససేమిరా అంగీకరించకపోగా మాట మార్చి రెండేళ్ల తర్వాత పెళ్లి అంటూ బుకాయిస్తున్నారు. దీంతో యువతి, ఆమె బంధువులు సోమవారం రాత్రి ప్రియుడి ఇంటి వద్ద నిరసన తెలిపారు. రెండేళ్లు కాదు..వెంటనే వివాహం జరగాలని పట్టుబట్టారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో యువకుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించి శాంతింపజేశారు. కాగా, సోమ, మంగళవారాల్లో ఇరువర్గాల మధ్య రాజీ చర్చలు జరిగినా అవి ఫలించలేదని తెలుస్తోంది.